

పుష్పాలంకరణతో కొత్త సంవత్సరానికి స్వాగతం

ప్రజాశక్తి - కలిదిండి

స్థానిక శ్రీ సుగుణ జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులు కొత్త సంవత్సరం 2025కి స్వాగతం పలుకుతూ వివిధ రకాల పూలతో కళాశాల ప్రాంగణంలో అలంకరించారు. కళాశాల ఛైర్మన్ కారి రాజమణి కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు.



కొత్త ఏడాదిపై..

ఆశలు.. ఆకాంక్షలెన్నో..!

2024 సంవత్సరానికి వీడ్కోలు పలికి.. కొత్త సంవత్సరం 2025లోకి జిల్లా ప్రజానీకం అడుగుపెట్టారు. తమ బతుకులు ఈ ఏడాదిలోనైనా మారాలని కోరుకుంటూ ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. జిల్లాను దీర్ఘకాలికంగా పట్టిపీడిస్తున్న సమస్యలు ఈ ఏడాదైనా ప్రభుత్వం పరిష్కరిస్తుందా అని ఆశగా ఎదురుచూస్తున్నారు. తాగునీటి సమస్య నుంచి పెరిగిన ధరల వరకూ అనేక సమస్యలతో జిల్లా ప్రజానీకం సతమతమవుతున్నారు. ఎన్నికల్లో జిల్లా అభివృద్ధికి అనేక హామీలు గుప్పించిన కూటమి సర్కార్ జిల్లా ప్రజలను దీర్ఘకాలికంగా వెంటాడుతున్న సమస్యలపై దృష్టి సారించి 2025లో ప్రజలు సంతోషంగా గడిపేలా చేస్తుందో, లేదో వేచిచూడాలి.



కొండెక్కిన నిత్యావసరాల ధరలు తగ్గేనా?

కౌలురైతుల కన్నీటి వ్యథ తీరేనా

పోలవరం నిర్వాసితులకు పరిహారం అందించేనా

చింతలపూడి రైతులకు న్యాయం జరిగేనా

తాగునీటి సమస్యను పరిష్కరించేనా

కొల్లేరులో రెగ్యులేటర్ల నిర్మాణం చేసేనా

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రస్తుతం ప్రజలను వెంటాడుతున్న సమస్యల్లో అధిక ధరలు అత్యంత ముఖ్యమైన అంశంగా చెప్పొచ్చు. కొండెక్కిన నిత్యావసర ధరలతో సామాన్య ప్రజానీకం అల్లాడిపోతున్నారు. కడుపు నిండా పట్టెడు అన్నం తినలేని స్థితికి సామాన్య కుటుంబాలు చేరాయి. కందిపప్పు కిలో రూ.175 పలుకుతుండగా, మినపప్పు, పచ్చిశెనగపప్పు వంటి ధరలు కిలో రూ.115 వరకూ పలుకుతున్నాయి. వంటనూనెలు కిలో రూ.140 దాటేశాయి. వెల్లుల్లి కిలో రూ.400 దాటగా, మిర్చి కిలో రూ.240కు చేరుకుంది. ఇలా అన్ని నిత్యావసరాల ధరలు సామాన్యులకు అందనంత ఎత్తుకు ఎగబాకాయి. గతంలో నెలసరి సరుకులకు రూ.రెండు వేలు ఖర్చయితే ఇప్పుడు అవే సరుకులకు రూ.ఐదువేల వరకూ ఖర్చు పెట్టాల్సిన దుస్థితి నెలకొంది. ఇక ఉల్లి, టమోటా వంటి ధరలు అమాంతంగా పెరుగుతున్న తీరు జనాలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. దీంతో కిలో కందిపప్పు వాడే కుటుంబాలు అర కిలోతోనే సరిపెట్టుకుంటున్నాయి. ఇప్పటికీ ఆక్వా పరిశ్రమల్లో పని చేసే కార్మికులకు రోజంతా కష్టపడితే రూ.250 వేతనమే వస్తోంది. ఆసుపత్రులు, ఎటిఎంల వద్ద పని చేసే సెక్యూరిటీ సిబ్బంది వేతనం నెలకు రూ.తొమ్మిది వేలు మించలేదు. ప్రయివేటు స్కూళ్ల పని చేసే ఉపాధ్యాయులకు రూ.పది వేలు వేతనం రావడమే గగనంగా ఉంది. నెలకు రూ.పదివేలలోపు వేతనం తీసుకునే కార్మికులు, ఉద్యోగులు, వ్యవసాయ కూలీలు జిల్లాలో మూడొంతులు మంది ఉన్నారు. ధరలు పెరుగుతున్నాయే తప్ప ఆదాయాలు మాత్రం అందుకు తగినట్లుగా పెరగకపోగా ఇంకా తగ్గుతున్న పరిస్థితి ఉంది. ఇలాంటి కుటుంబాలన్నీ ధరల పెరుగుదలతో అర్ధాకలితోనే కాలం వెళ్లదీస్తున్న పరిస్థితి. ఇది సామాన్యుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రొటీన్ లోపంతో అనారోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. ప్రభుత్వం ధరల నియంత్రణకు చర్యలు చేపడుతున్నట్లు చెబుతున్న మాటలన్నీ వట్టి బూటకంగానే మారాయి. 2025లోనైనా ధరలు తగ్గాలని జనం కోరుకుంటున్నారు. ప్రభుత్వాలు ఏవిధంగా ముందుకు సాగుతాయో వేచిచూడాలి.

కౌలురైతుల కన్నీటి వ్యథలు

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో వ్యవసాయ సాగులో 80 శాతం కౌలురైతులే చేస్తున్నారు. రెండు జిల్లాల్లో దాదాపు మూడు లక్షల కౌలురైతుల కుటుంబాలు ఉన్నాయి. వ్యవసాయ సాగులో కీలక పాత్ర పోషిస్తున్న కౌలురైతులను ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. సాగు చేయని భూయజమానులకు ప్రభుత్వం సాయం చేస్తోంది. ఆరుగాలం కష్టపడిన కౌలురైతులకు ఏమాత్రం మేలు చేయడం లేదు. పంట రుణాల మంజూరు నుంచి పంట నష్టపరిహారం, బీమా ఏఒక్కటీ కౌలురైతులకు దక్కడం లేదు. కౌలుచట్టంలో మార్పులు చేసి కౌలురైతులకు న్యాయం చేస్తామని కూటమి ప్రభుత్వం చెప్పింది. అధికారం చేపట్టి ఆరు నెలలైనా ఇప్పటికీ ఉలుకుపలుకు లేదు. కొత్త సంవత్సరంలోనైనా కౌలురైతులకు మేలు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందో, లేదో వేచిచూడాలి.

పోలవరం నిర్వాసితులకు పరిహారం అందేనా.. చింతలపూడి రైతులకు న్యాయం జరిగేనా?

పోలవరం నిర్వాసితులకు న్యాయం చేస్తామని, పునరావాస ప్యాకేజీ రూ.పది లక్షలకు పెంచుతామని 2006కు ముందు సేకరించిన భూములకు రూ.ఐదు లక్షల పరిహారం ఇస్తామని హామీ ఇచ్చి 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ఐదేళ్ల పాలనలో పోలవరం నిర్వాసితులను పట్టించుకోలేదు. కాపర్ డ్యామ్ పూర్తి కావడంతో జులై, ఆగస్టు నెలల్లో విరుచుకుపడుతున్న గోదావరి వరదలకు కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని దాదాపు 20 వేలకుపైగా కుటుంబాలు నానా ఇబ్బందులు పడుతున్నాయి. 2026కు పోలవరం పూర్తి చేస్తామని కూటమి ప్రభుత్వం చెబుతోంది. ముందుగా పోలవరం నిర్వాసితులకు పరిహారం ఇవ్వాల్సి ఉంది. కొత్త ఏడాదిలోనైనా పోలవరం నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం అందించి న్యాయం చేస్తారో, లేదో వేచిచూడాలి. 2025లోనైనా పోలవరం నిర్వాసితులకు కష్టాల నుంచి విముక్తి కల్పించాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు. మరోపక్క చింతలపూడి ఎత్తిపోతల ప్రాజెక్టులో భూములు కోల్పోతున్న బాధిత రైతులు న్యాయమైన పరిహారం కోసం గడిచిన పదేళ్లుగా పోరాటం చేస్తున్నారు. మార్కెట్లో ఎకరా భూమి రూ.50 లక్షలు ఉండగా, ప్రభుత్వం మాత్రం ఎకరాకు రూ.12 లక్షలు, రూ.19 లక్షలు మాత్రమే ఇస్తామని రైతులకు అన్యాయం చేసేందుకు పూనుకుంది. చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తామని కూటమి ప్రభుత్వం చెబుతోంది. ఈ ఏడాదైనా చింతలపూడి ఎత్తిపోతల బాధిత రైతులకు న్యాయమైన పరిహారం ఇచ్చి సమస్యను పరిష్కరిస్తారో లేదో చూడాలి.

తాగునీటి కష్టాలు తీరేనా.. కొల్లేరు రెగ్యులేటర్ నిర్మాణం జరిగేనా?

రెండు జిల్లాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్యల్లో తాగునీటి సమస్య ఒకటి. ముఖ్యంగా డెల్టాలో తాగునీటి సమస్య అత్యంత తీవ్రంగా ఉంది. పక్కనే గోదావరి ఉన్నా తాగేందుకు గుక్కెడు నీళ్లు లేకుండాపోయాయి. విచ్చలవిడిగా తవ్విన ఆక్వా చెరువులతో తాగునీటి వనరులన్నీ పూర్తిగా కలుషితమయ్యాయి. దీంతో ప్రతి కుటుంబమూ తాగునీరు కొనుక్కోవాల్సిన దుస్థితి ఏర్పడింది. పాలు కంటే నీళ్ల కోసమే ఎక్కువ ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి దాపురించింది. 2014లో అధికారంలోకి వచ్చినప్పుడు టిడిపి ప్రభుత్వం గోదావరి నుంచి పైప్‌లైన్ ద్వారా తాగునీరు అందించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పింది. అయితే చేయలేదు. తర్వాత వచ్చినా వైసిపి సైతం వాటర్ గ్రిడ్ పథకంపై హడావుడి చేయడం తప్ప ఒక్క అడుగూ ముందుకు వేయలేదు. దీంతో తాగునీటి సమస్య జనాన్ని వెంటాడుతూనే ఉంది. 2025లోనైనా తాగునీటి సమస్యకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రెండు జిల్లాల ప్రజానీకం కోరుకుంటున్నారు. కొల్లేరులోకి సముద్రం నుంచి ఉప్పు నీరు ప్రవేశించకుండా రెగ్యులేటర్ల నిర్మాణం చేపట్టనున్నట్లు వైసిపి ప్రభుత్వం తెగ హడావుడి చేసింది. దుంపగడప, మొల్లపర్రు, పడితడక వద్ద మొత్తం మూడు రెగ్యులేటర్ల నిర్మాణానికి ప్రణాళికలు రచించి రూ.450 కోట్లకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. పనులు మాత్రం జరగలేదు. కూటమి ప్రభుత్వమైనా రెగ్యులేటర్ల నిర్మాణం పూర్తి చేయాలని కొల్లేరువాసులు కోరుకుంటున్నారు. అదేవిధంగా గత ఐదేళ్లుగా పడకేసిన డెల్టా ఆధునికీకరణను పూర్తి చేయాలని జిల్లా రైతాంగం ఎంతో ఆశగా ఎదురుచూస్తోంది.

జిల్లా ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలి



రాష్ట్ర గృహనిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారధి

కొత్త సంవత్సరంలో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలి. ప్రతి కుటుంబంలో అభివృద్ధి కాంతులు వెల్లివిరియాలి. జిల్లా ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులు, ఉద్యోగులు అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు.

మంచి అభివృద్ధి సాధించాలి



కలెక్టర్ కె.వెట్రిసెల్వి

జిల్లా ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు. జిల్లా ప్రజలకు 2025లో అంతా మంచి జరగాలి. అంతా ఆనందంగా ఉండాలి. జిల్లాలో మంచి పంటలు పండి విద్యా, పారిశ్రామికపరంగా కూడా మంచి అభివృద్ధి సాధించాలి.

ఆశయాలు నెరవేరాలి



జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్

జిల్లా ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు, ఉద్యోగులకు అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. నూతన సంవత్సరంలో ప్రజలంతా ప్రశాంత వాతావరణంలో కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలి. కొత్త సంవత్సరంలో మీ జీవితంలో ఆనందం, ఆరోగ్యం, నిండుగా ఉండాలి. మీ ఆశయాలు నెరవేరాలి.

అమిత్‌షా తక్షణం రాజీనామా చేయాలి

సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన నిరసనలు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

పార్లమెంటులో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా తక్షణం రాజీనామా చేయాలని, లేకుంటే ఆయనను ప్రధాని మోడీ బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఎం.నాగులపల్లిలో అంబేద్కర్ విగ్రహం వద్ద చేపట్టిన ఆందోళనలో తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చాట్ల నాగరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఎం నేత ఆర్.లింగరాజు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాతనే అవమానించిన బిజెపి నేతలకు దేశాన్ని పరిపాలించే అర్హత లేదన్నారు. రాజ్యాంగాన్ని మార్చడం కోసం, మనువాద రాజ్యాన్ని తీసుకురావడం కోసం బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ కుట్ర చేస్తున్నాయని, ఆ కుట్రకు రాష్ట్రంలోని టిడిపి, జనసేన, వైసిపి సహకరించడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో బిఎస్‌పి నాయకులు సిర్రా భరత్‌కుమార్, సిపిఎం నేత కట్టా భాస్కర్‌రావు తదితరులు మాట్లాడారు.

ఆగిరిపల్లి: రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌పై పార్లమెంట్ సాక్షిగా కేంద్రమంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని, అమిత్‌షాను కేంద్ర మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి నాయకులు చలసాని రామారావు డిమాండ్ చేశారు. అంబేద్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం మండల పరిధిలోని అడవినెక్కలంలో అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు నిమ్మగడ్డ నరసింహా, అడవినెక్కలం సర్పంచి వేము రాజు, బొడ్డు పూర్ణ, కోటయ్య, ప్రకాశ్, రవి, భారతమ్మ పాల్గొన్నారు.



ద్వారకాతిరుమలలో..



ఆగిరిపల్లిలో..

పిజిఆర్‌ఎస్ అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలి


కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు: ప్రజల నుంచి వచ్చే రెవెన్యూ సంబంధిత అర్జీలను తక్షణమే నాణ్యతతో పరిష్కరించడానికి జిల్లా యంత్రాంగం చిత్తశుద్ధితో పని చేస్తోందని కలెక్టర్ కె.వెట్రిసెల్వి చెప్పారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం నుంచి పిజిఆర్‌ఎస్ (రెవెన్యూ), రెవిన్యూ సదస్సులు, రీసర్వే తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో భూపరిపాలన ప్రధాన కమిషనర్ జి.జయలక్ష్మి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి కలెక్టర్ వెట్రిసెల్వి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో రెవెన్యూ అంశాలకు సంబంధించి పట్టాదారు పాస్ పుస్తకం, ఇళ్ల స్థలాలు, మ్యూటేషన్స్ తదితర అర్జీల పరిష్కార తీరును కలెక్టర్ వివరించారు. అర్జీలు అందిన వెంటనే వాటిని పరిశీలించి అర్జీదారుని సంతృప్తి చెందేలా పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో ఇంతవరకు 479 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి 4,831 అర్జీలు స్వీకరించారన్నారు. వీటిలో 1793 అర్జీలు పరిష్కరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సిసిఎల్ఎ కమిషనర్ జయలక్ష్మి మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సదస్సులు ముగిసేవరకు ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న భూముల సమస్యలను పరిష్కరించడమే రెవెన్యూ సదస్సుల ముఖ్యోద్దేశమన్నారు. భూసమస్యల పరిష్కారంలో ప్రజల సంతృప్తిస్థాయి మెరుగ్గా ఉండేలా తహశీల్దార్లు పని చేయాలన్నారు. నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించిన భూముల వివరాలను పునఃపరిశీలించాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. జనవరి మొదటి వారంలోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. రీసర్వే అదనపు ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ రీసర్వేపై క్షేత్రస్థాయిలో పనిచేసే రెవెన్యూ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో లక్ష ఇళ్లకు గృహ ప్రవేశాలు

పింఛన్ల పంపిణీలో మంత్రి కొలుసు పార్థసారధి

చాట్రాయి: మండలంలోని సోమవరం, చాట్రాయి గ్రామాల్లో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్లను రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖా మంత్రి కొలుసు పార్థసారధి మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛను తీసుకుంటున్న భర్త చనిపోతే వెంటనే భార్యకు పింఛను ఇచ్చే విధానాన్ని ప్రభుత్వం అమల్లోకి తెచ్చిందన్నారు. అందులో భాగంగా ఈ నెలలో రాష్ట్రవ్యాప్తంగా 5,402 మందికి కొత్తగా పింఛన్లు అందిస్తుండగా జిల్లాలో 212 మందికి స్పౌజ్ కేటగిరీ కింద పెన్షన్లు మంజూరు చేశామన్నారు. గత మూడు నెలల వ్యవధిలో వివిధ రకాల కారణాలతో పెన్షన్ తీసుకోకుండా ఉన్న 50 వేల మందికి సైతం బకాయిలతో సహా అందిస్తున్నామన్నారు. నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రిలో త్వరలో 200 పడకలతో నూతన భవనం ప్రారంభిస్తామన్నారు.



పింఛను సొమ్ము అందిస్తున్న మంత్రి పార్థసారధి

లక్ష ఇళ్లకు త్వరలో గృహ ప్రవేశాలు

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో ఇప్పటి వరకు లక్ష ఇళ్లు పూర్తయ్యాయని, మార్చి నాటికి మరో 50 వేల ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని కృత నిశ్చయంతో ఉన్నామని మంత్రి పార్థసారధి చెప్పారు. ఇప్పటికే పూర్తయిన లక్ష ఇళ్లకు త్వరలో గృహ ప్రవేశాలు నిర్వహించి లబ్ధిదారులకు ఇంటి తాళాలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఇళ్ల నిర్మాణం పూర్తయిన కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సర్పంచి శోభనబాబు, కూటమి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎంఇ సర్వేను వేగవంతం చేయాలి

జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ఏలూరు: స్వర్ణాంధ్ర-2047 విజన్ ప్రకారం జిల్లాలో కొత్త పరిశ్రమల ఏర్పాటు సంకల్పానికి అనుగుణంగా సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో మంగళవారం కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధ్యక్షతన జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ఏదైనా లక్ష్యం సాధించాలంటే రోజువారీ కార్యాచరణతో కష్టపడాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఎప్పటికప్పుడు లక్ష్య సాధనలో పురోగతి కనబరచాలన్నారు. జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి ప్రతి పక్షానికీ ఒకసారి జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశాలు నిర్వహించాలన్నారు. పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు నిర్వహించిన తనిఖీల అనంతరం ఆయా పరిశ్రమల్లో తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై ఆయా యాజమాన్యాలు తీసుకున్న చర్యల నివేదికను పొందాలని, నివేదికలు అందించని యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరిశ్రమల స్థాపనను ప్రోత్సహించాలని, అందుకు సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా వచ్చిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని అన్నారు. పరిశ్రమల అనుమతి కోసం 236 దరఖాస్తుల్లో 239 ఆమోదం పొందాయన్నారు. నిర్దిష్ట గడువు వరకు వేచిచూడకుండా సత్వరమే నిబంధనల మేరకు అనుమతులు మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎంఎస్‌ఎంఇ సర్వేను వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. జిల్లాలో పరిశ్రమలకు సంబంధించి రాయితీలకు అందిన క్లెయిమ్‌ల స్క్రూట్నీ, వెరిఫికేషన్ కమిటీ క్షుణంగా పరిశీలించి ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. జిల్లాలో వ్యవసాయ అనుబంధ ఆధారిత పరిశ్రమల అభివృద్ధి ఇండస్ట్రియల్ క్లస్టర్ల అభివృద్ధికి వేగవంతమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానమంత్రి ఉపాధి హామీ కార్యక్రమం (పిఎంఇజిపి) కింద పరిశ్రమల ఏర్పాటుకు ఎటువంటి ఆటంకాలూ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పిఎంఇజిపి కింద పరిశ్రమల ఏర్పాటుకు ఆసక్తి చూపే ప్రతినిధులతో డిఆర్‌డిఎ, వ్యవసాయ, ఉద్యాన, ఎల్‌డిఎం తదితర అధికారులతో కలిసి అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. దరఖాస్తు చేసుకున్న పారిశ్రామికవేత్తలకు రుణాల మంజూరులో ఏమైనా సమస్యలుంటే బ్యాంకర్ల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించాలన్నారు. ఒఎన్‌డిసి ప్లాట్‌ఫారంలో జిల్లాలోని మండలాలవారీగా ఒక ఉత్పత్తిని విక్రయాలకు ఉంచే విధంగా వ్యవసాయ, ఉద్యాన, డిఆర్‌డిఎ, ఐటిడిఎ తదితర శాఖలు అర్హులైన వారిని గుర్తించాలన్నారు. ఒఎన్‌డిసికి సంబంధించి ఆయా శాఖల అధికారులతో కలిపి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని జిల్లా పరిశ్రమల కేంద్రం జిఎంను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఉన్న 110 పరిశ్రమల్లో చైల్డ్‌కేర్, ఫీడింగ్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ద్వారకాతిరుమల మండలం పి.కన్నాపురంలో శ్రీ సర్వారాయ సుదర్శన్ లిమిటెడ్‌కు సంబంధించి నీటి సరఫరాపై తీసుకోవాల్సిన చర్యలపై సాంకేతికపరమైన అంశాలతో కూడిన టెక్నికల్ రిపోర్టును సమర్పించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.



సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జిఎం సుబ్రహ్మణ్యేశ్వరరావు, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, ఎల్‌డిఎం డి.నీలాద్రి, వ్యవసాయశాఖ జెడి హబీబ్‌భాషా, ఉద్యానశాఖ డిడి రామ్మోహన్, ఎపిఐఐసి జెడ్‌ఎం కె.బాబ్జి, వాణిజ్యపన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ రాంబాబు, లీగల్ అండ్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్ హరిప్రసాద్, సోషల్ వెల్ఫేర్ జెడి జయప్రకాష్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆర్.త్రినాధరావు, కాలుష్య నియంత్రణ మండలి ఇఇ వెంకటేశ్వరరావు, గ్రౌండ్‌వాటర్ డిడి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌కు అనూహ్య స్పందన

525కుపైగా వినతులు స్వీకరించిన ఎంఎల్‌ఎ ధర్మరాజు

ప్రతి అర్జీ పరిష్కారానికి కృషి చేస్తాం : ఎంఎల్‌ఎ హామీ

ప్రజాశక్తి - ఉంగుటూరు

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాదర్బార్ నిర్వహించాలనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఉంగుటూరు, భీమడోలు, గణపవరం ,నిడమర్రు మండలాలవారీగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ప్రతి కౌంటర్‌లో ఆయా మండలస్థాయి అధికారులు అర్జీలను ఆన్‌లైన్ చేశారు. తొలుత ఆయా కౌంటర్లలో కూటమి నేతలు అర్జీలు రాయడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అక్కడ నుంచి ఎంఎల్‌ఎ వద్దకు టోకెన్ నెంబర్లువారీగా అర్జీదారులను పంపించారు. ఎంఎల్‌ఎ ధర్మరాజు, డిపిఒ కె.అనురాధ అర్జీదారుల సమస్యలు తెలుసుకుని, ఆయా అర్జీలను సంబంధిత మండల అధికారులకు పంపించారు. నియోజకవర్గ స్థాయిలో దాదాపు 525కుపైగా అర్జీలు వచ్చాయి. కోతులు సంచారం ఎక్కువగా ఉందని, పసిపిల్లలను ఎత్తుకుపోతున్నాయని ఫిర్యాదు చేస్తే సమస్య పరిష్కారం కాకుండానే పరిష్కరించినట్లు ఎండార్స్‌మెంట్ ఇవ్వడం ఎంత వరకు సబబు అని నిడమర్రు మండలానికి చెందిన జనసేన కార్యకర్త ఫిర్యాదు చేశారు. అనంతరం అర్జీదారులనుద్దేశించి ఎంఎల్‌ఎ మాట్లాడుతూ గ్రామస్థాయిలో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో నాలుగు మండలాల అధికారులు, జనసేన, టిడిపి, బిజెపి నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



వికలాంగ మహిళ పరిస్థితిని పరిశీలిస్తూ..

కొత్త నిర్మాణాలు చూపమంటే పాతవి చూపిస్తారా

హౌసింగ్ అధికారులపై కలెక్టర్ ఆగ్రహం

ప్రజాశక్తి - ఉంగుటూరు

హౌసింగ్ అధికారుల తీరుపై జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మండలంలోని చేబ్రోలులో జగనన్న హౌసింగ్ కాలనీలో ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజుతో కలసి ఆమె పర్యటించారు. ముందుగా మండలంలో గృహనిర్మాణాలు వేగవంతంగా జరిగే వాటిని చూసి లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడాలని కలెక్టర్ భావించారు. గృహనిర్మాణ శాఖ జిల్లా అధికారులు ఎప్పుడో ప్రారంభించేసిన చేబ్రోలు జగనన్న కాలనీకి తీసుకెళ్లి అక్కడ నిర్మాణాలు ఇంకా జరుగుతున్నాయని చూపించే ప్రయత్నాన్ని కలెక్టర్ తప్పుబట్టారు. అక్కడ ఇళ్లల్లో ప్రజలు కూడా లేకపోవడంతో కలెక్టర్ వస్తుంటే సరైన ప్రణాళిక రూపొందించుకోరా అంటూ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. చేబ్రోలులో సీసీ రోడ్డు నిర్మాణాన్ని ఆమె తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. రోడ్డు మందం, ఇతర నాణ్యతలను స్వయంగా పరిశీలించారు. రాచూరులో పలు సమస్యలను గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా ప్రతిపాదనలు రూపొందించాలని ఎంఎల్‌ఎ విజ్ఞప్తి చేశారు.



కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఆరోగ్యశ్రీ ఆసరా ఆపడం దారుణం

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ఏలూరు అర్బన్: గతేడాది అక్టోబర్ నుండి ఎన్‌టిఆర్ వైద్యసేవా పేరుతో ఉన్న ఆరోగ్యశ్రీ 'ఆసరా' పథకాన్ని కూటమి ప్రభు త్వం ఆపివేయడం దారుణమని, ఇదేనా ఎన్‌టిఆర్‌కు ఇచ్చే గౌరవం అని సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా విమర్శించింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశా రు. గత వైసిపి ప్రభుత్వం వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ పేరుతో ఈ పథకాన్ని అమలు చేస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్‌టిఆర్ ఆరోగ్యశ్రీ పేరుతో అమలు చేస్తుందని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆరోగ్యశ్రీ పథకం ముఖ్యంగా సర్జరీ అనంతరం వర్తించే 'ఆసరా' పథకం ఎంతో ఉపయోగంగా ఉందని తెలిపారు. అయితే అక్టోబర్ నుండి ఆరోగ్యశ్రీ ఆసరా పథకం నిలిచిపోవడంతో ఈ మూడు నెలల కాలంలో దాదాపుగా సుమారు తొమ్మిది వేల మంది రోగులకు ఆర్థిక సాయం అందకుండా పోయిందని పేర్కొన్నారు. ఈ పథకంలో చికిత్స పొందే వారంతా నిరుపేదలేనని, సర్జరీ తర్వాత ఏ పనీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉంటారు కాబట్టి వారికి ఆర్థిక సాయం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని తెలిపారు. ప్రస్తుతం ఆ బాధ్యతల నుంచి కూటమి ప్రభుత్వం వైదొలగడం అన్యాయమని ఆయన తీవ్రంగా విమర్శించారు. తక్షణమే కూటమి ప్రభుత్వం ప్రజల పై మోపే భారాలను నిలిపివేయాలని, పేదలకు ఆసరాగా ఉండే పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజల వ్యతిరేకతను, ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు.

నేరాల శాతం తగ్గుముఖం

నేర సమీక్షలో ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

జిల్లాలో గడిచినటువంటి పోలిస్తే పూర్తిగా నేరాల సూచీలో మైనస్ 26 శాతం నేరాలు తగ్గడం నమోదు చేస్తుందని ఏడాది నేర సమీక్ష సమావేశంలో ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ వెల్లడించారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎస్‌పి వివరాలు వెల్లడించారు. జిల్లాలో 2023లో 10,648 కేసులు నమోదు కాగా ఈ ఏడాది 7,891 కేసులు నమోదయ్యాయని తెలిపారు. మొత్తంగా ఇవి మైనస్ 26 శాతంగా నేరాల సంఖ్య తగ్గుముఖం పట్టిందన్నారు. మహిళలపై అత్యాచార ఘటన కేసుల్లో గడిచిన 63 నమోదు కాగా ఈ ఏడాది 78 నమోదయ్యాయని తెలిపారు. గడిచిన 644 రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోగా ఈ ఏడాది 590 రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయన్నారు. వీటిలో తగ్గుదల శాతం 8.5గా నమోదైందన్నారు. ఈ ఏడాది మొబైల్ ఫోన్లు పెద్ద మొత్తంలో రికవరీ చేశారు. 778 మొబైల్ ఫోన్లు రికవరీ చేసి ఆయా బాధితులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ మాట్లాడుతూ జిల్లాలో నేరాలు తగ్గుముఖం పట్టేందుకు అనేక చర్యలు చేపట్టామన్నారు. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

ప్రజాశక్తి - ఉంగుటూరు

రూ.12 లక్షల వ్యయంతో కొత్తగా నిర్మించిన ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ లైన్‌ను జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. ఉంగుటూరు రైల్వేగేట్ అవతల లో వోల్టేజీతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అధికారులు కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌కు నిధులు మంజూరు చేశారు. కొత్తగా విద్యుత్ స్తంభాలు, తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఎంఎల్‌ఎ ధర్మరాజు మాట్లాడుతూ ప్రతిఒక్కరికీ నాణ్యమైన విద్యుత్తును అందించేందుకు కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు.

అధికారులు మండలాభివృద్ధికి సహకరించాలి

పోలవరం ఎంఎల్‌ఎ బాలరాజు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి


మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ బాలరాజు

మండలంలోని అధికారులు మండలాభివృద్ధికి సహకరించాలని పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు అధికారులకు ఆదేశించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల స్థాయి అధికారుల సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మండల స్థాయిలో జరుగుతున్న అభివృద్ధి పనుల ప్రగతి నివేదికలను పరిశీలించారు. అనంతరం ఆయా శాఖల అభివృద్ధి నివేదికలపై అధికారులను ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో అభివృద్ధి శూన్యమని విమర్శించారు. టిడిపి కూటమి అధికారంలోకొచ్చిన ఆరు నెలల్లోనే మండలానికి ఎక్కువ నిధులను తీసుకొచ్చినట్లు తెలిపారు. త్వరలోనే సీసీ రోడ్లకు మరిన్ని నిధులను తెచ్చేలా చూస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ అధికార ప్రతినిధి గడ్డమణుగు రవి, పార్టీ మండలాధ్యక్షులు పి.రాము, ఎంపిటిసి సభ్యులు నాలి శ్రీను, మండల ప్రత్యేకాధికారి మహ్మద్ రాజాఉల్ల, పలువురు డిఇలు, ఎంపిడిఒ కె.వెంకటలక్ష్మి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సత్సంబంధాలు కలిగి ఉండాలి : డిఐజి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పోలీస్, మీడియా సత్సంబంధాలు అన్నదమ్ముల బంధంలా ఉండాలని ఏలూరు రేంజ్ ఐజి జివిజి అశోక్‌కుమార్ అన్నారు. ఏలూరు రైల్వేస్టేషన్ వద్ద ఉన్న ఇరిగేషన్ గెస్ట్‌హౌస్‌లో మంగళవారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (ఎపియుడబ్ల్యుజె) జిల్లా కమిటీ కార్యవర్గ సమావేశానికి డిఐజి అశోక్‌కుమార్, ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సమావేశానికి జిల్లా కమిటీ అధ్యక్షులు కెపికె.కిషోర్ అధ్యక్షత వహించారు. అనంతరం డిఐజి, ఎస్‌పిలకు జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఐజెయు కార్యవర్గ సభ్యులు జివిఎస్ఎన్.రాజు, ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మాణిక్యాలరావు, ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర మాజీ కార్యదర్శి జి.రఘురామ్, ఏలూరు జిల్లా అధ్యక్షులు కెపికె.కిషోర్ వివరించారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి - చింతలపూడి

నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. 2025 నూతన సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా ప్రభుత్వ లక్ష్యాలు, ప్రజలకు అందించే సేవలు విషయంపై అధికారులు ప్రజలకు జవాబుదారులుగా ఉండాలని ఆయన అన్నారు. సోమవారం మీట్ విత్ ఎంఎల్‌ఎ కార్యక్రమాన్ని అధికారులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లు అభివృద్ధి, పెన్షన్ల పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత ఇసుక గురించి వివరించారు. బ్రిడ్జిల నిర్మాణంపై దృష్టి పెడుతున్నట్లు తెలిపారు. గుండేరు వాగు వంతెన, బైనేరువాగు, కళ్ల చెరువు వంతెనల కోసం రూ.12 కోట్లతో బ్రిడ్జిలు నిర్మిస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

ప్రజాశక్తి - దెందులూరు

పదో తరగతి విద్యార్థులంతా కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని, ఎస్‌సిఇఆర్‌టి విడుదల చేసిన ముఖ్య ప్రశ్నలు మాదిరి ప్రశ్నపత్రాలను బాగా ప్రాక్టీస్ చేయాలని డిఇఒ ఎం.వెంకటలక్ష్మమ్మ విద్యార్థులకు సూచించారు. కొవ్వలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డిఇఒ వెంకటలక్ష్మమ్మ మంగళవారం సందర్శించారు. పాఠశాలలోని పిఎఎల్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, లైబ్రరీ, స్టిచింగ్ రూమ్, డైనింగ్ హాలు సందర్శించారు.

నేరాలు - ఘోరాలు

చోరీలకు పాల్పడే ముఠాలో ముగ్గురు అరెస్టు

రూ.1.62 కోట్ల విలువైన బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడే ముఠాలో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.1.62 కోట్ల విలువైన వెండి, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... కొంతకాలంగా జిల్లాలోని నూజివీడు సర్కిల్ పరిధిలో, పెదవేగి సర్కిల్ పరిధిలో, ఏలూరు సబ్ డివిజన్ పరిధిలోని ఐదు పోలీస్ స్టేషన్ల పరిధిలో, పోలవరం సబ్ డివిజన్ పరిధిలో పలు గృహాల్లో దొంగతనాలు చోటు చేసుకున్నాయి. దీనిపై ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో కేసులు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసులకు మూడేళ్ల తర్వాత వీరి ఆచూకీ లభించింది. ఐదుగురు ముఠా సభ్యులు ఉన్న ఈ ముఠాలో ముగ్గురు నిందితులను పోలీసులు వాహన తనిఖీల్లో గుర్తించారు. వారి వద్ద నుంచి రెండు కేజీల బంగారు ఆభరణాలను, 13 కేజీల వెండి ఆభరణాలతో పాటు ఒక లక్ష నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ నగరానికి చెందిన తేళ్ల యేసు 2007 నుంచి 2016 వరకు పలు నేరాలకు పాల్పడి 18 కేసుల్లో జైలు శిక్ష అనంతరం బయటకు వచ్చి ఆటో తోలుకుంటూ జీవనాన్ని సాగించసాగాడు. 2021లో మళ్లీ వ్యసనాలకు బానిసయ్యాడు. ఆ సమయంలో ఏలూరు నగరానికి చెందిన గండిపూడి రాజకుమార్ (నాని), పెదపాడు మండలం వేంపాడు గ్రామానికి చెందిన సాయల రాంబాబు, ఏలూరు రూరల్ మండలం చిరంజీవి బస్టాండ్ ప్రాంతానికి చెందిన వేముల యేసు, వంకాయగూడెం ప్రాంతానికి చెందిన దాసరి బాలరాజులతో ఇతనికి పరిచయం ఏర్పడింది. 2021 నుంచి ముఠాగా ఏర్పడి ఇళ్లల్లో చోరీలకు పాల్పడ్డారు. వాహన తనిఖీల్లో ఈ ముఠాలో ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

బెస్తగూడెంలో పట్టపగలు చోరీ

కుక్కునూరు : మండలంలోని బెస్తగూడెంలో ఓ ఇంట్లో పట్టపగలే చోరీ జరిగింది. సుమారు రూ.నాలుగు లక్షల విలువైన బంగారం, కొంత నగదు అపహరణకు గురైనట్లు స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బెస్తగూడెం గ్రామానికి చెందిన కంటె నాగరాజు అతని కుటుంబ సభ్యులు సోమవారం పొలం పనులకు వెళ్లారు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఇంట్లోకి దొంగలు చొరబడి బీరువా తలుపులు తెరిచి అందులో ఉన్న 38 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.80 వేల నగదును దోచుకెళ్లారు. బాధిత కుటుంబసభ్యులు పొలం పనులను పూర్తి చేసుకుని సాయంత్రానికి ఇంటికి చేరుకున్నారు. కాగా ఇంట్లో దొంగతనం జరిగినట్లు గమనించిన బాధితుడు నాగరాజు కుక్కునూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు విచారణ చేపట్టారు.

విక్టర్‌ప్రసాద్ సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - చింతలపూడి

33 ఏళ్లుగా నిరంతరం ప్రజలకు ఉన్నత స్థాయిలో ఇఓపిఆర్‌డి విక్టర్‌ప్రసాద్ సేవలందించారని, ఆయన చేసిన సేవలు మరువలేనివని ఎంపిడిఒ మురళీకృష్ణ అన్నారు. మండలంలో ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఇఓపిఆర్‌డి విక్టర్ ప్రసాద్ ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శులతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూనియర్ అసిస్టెంట్‌గా విస్సన్నపేటలో ఉద్యోగ ప్రస్థానం మొదలుపెట్టి, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేశారని తెలిపారు. ఇఓపిఆర్‌డిగా లింగపాలెంలో ఉద్యోగోన్నతి పొంది, చింతలపూడి మండలంలో ఉద్యోగ విరమణ చేస్తున్నారన్నారు. ఎనిమిదేళ్లుగా ఇఓపిఆర్‌డిగా బాధ్యతలు నిర్వర్తించారని తెలిపారు. చేసే పని పట్ల నిబద్ధతతో పని చేసేవారన్నారు. ఉన్నతాధికారులు ఇచ్చిన పనిని సకాలంలో మాట పడకుండా పూర్తి చేసేవారన్నారు. ఎన్నో సవాళ్లను, ఒత్తిళ్లను అధిగమించి ఈ స్థాయికి వచ్చారని, సమర్థవంతంగా ఉద్యోగ కర్తవ్యాన్ని నిర్వహించారని తెలిపారు.

చింతలపూడి ఏరియా ఆసుపత్రి సందర్శన

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన స్టీమి ప్రోగ్రాంలో రూ.40 వేల విలువైన టెనెక్ట్ ప్లాజ్ ఇంజక్షన్ ద్వారా ఆరుగురి ప్రాణాలు కాపాడటం ఆనందంగా ఉందని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. మండలంలోని ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌ను ఆయన మంగళవారం సందర్శించారు. ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి సహకరించిన దాతలను సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ వంద పడకల ఆసుపత్రి త్వరగా పూర్తి చేసి, ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తామని తెలిపారు. ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, సకాలంలో వైద్యం ఉండే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు.

ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధి ప్రజాశక్తి

క్యాలెండర్ ఆవిష్కరణలో వక్తలు

ప్రజాశక్తి - ముదినేపల్లి


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సర్పంచి కైకమ్మ, డాక్టర్ మనోజ్

ప్రభుత్వానికి ప్రజలకు మధ్య ప్రజాశక్తి వారధిగా పని చేస్తూ ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకొస్తుందని ముదినేపల్లి గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ, సమాజ సేవకులు డాక్టర్ అంబుల మనోజ్ అన్నారు. ముదినేపల్లిలోని వైష్ణవి మనోజ్ హాస్పిటల్ ఆవరణంలో ప్రజాశక్తి 2025 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను మంగళవారం సాయంత్రం ముదినేపల్లి గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ, సమాజ సేవకులు డాక్టర్ అంబుల మనోజ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాశక్తి పత్రిక ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం వార్తా కథనాలు రాస్తుందన్నారు. నిజాలను నిర్భయంగా రాస్తూ వాస్తవాలను వెలుగులోకి తెస్తోందన్నారు. సామాన్యులను ఆలోచింపచేసి ప్రజలను చైతన్య పరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి, దళిత సీనియర్ నాయకులు నిమ్మగడ్డ బిక్షాలు, కాకరవాడ మాజీ సర్పంచి బేతపూడి వెంకటరమణ, నున్న రాంప్రసాద్, దాసరి లక్ష్మణ్, ప్రజాశక్తి విలేకరి శేవా సెల్వరాజు, తదితరులు పాల్గొన్నారు.

జెడి నెహ్రూబాబు సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - టి.నరసాపురం, ఏలూరు


నెహ్రూబాబు దంపతులను సన్మానిస్తున్న వక్తలు

జిల్లా పశుసంవర్ధక శాఖ సంచాలకులు గెడ్డం నెహ్రూబాబు సేవలు అభినందనీయమని ఏలూరు జిల్లా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ సర్వీసు అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.కోటేశ్వరరావు అన్నారు. డాక్టర్ జి.నెహ్రూబాబు ఉద్యోగ విరమణ సందర్భంగా మంగళవారం ఏలూరులో జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకుల కార్యాలయంలో నెహ్రూబాబు, శ్రీదేవి దంపతులను జిల్లా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ సర్వీసు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యునియన్ సభ్యులు మాట్లాడుతూ గత 39 ఏళ్లుగా పశుసంవర్ధక శాఖలో వివిధ హోదాల్లో పని చేసిన నెహ్రూబాబు మూగజీవులకు ఎనలేని సేవలందించారన్నారు. ఉద్యోగం పట్ల అంకితభావంతో పనిచేస్తూ అంచెలంచెలుగా ఎదిగి సహాయ సంచాలకులుగా ఉద్యోగ విరమణ పొందడం అబినందనీయమని కొనియాడారు. అనంతరం నూతన పశు సంవర్ధక సహాయ సంచాలకులుగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ టి.గోవిందరాజును సన్మానించారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ పొందిన నెహ్రూబాబు మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి ఏదో ఒక రోజు ఉద్యోగ విరమణ పొందాలన్నారు. సన్మానించి అభినందనలు తెలిపిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూనియన్ సభ్యులు డాక్టర్ ఎపి.ధనశ్యామ్, డాక్టర్ వై.క్రాంతికిరణ్, డాక్టర్ బిఆర్.శ్రీనివాసన్, డాక్టర్ ఎల్‌వి.సుప్రియ, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

492 ప్రమాదాల్లో రూ.3.14 కోట్ల ఆస్తినష్టం

అత్యధికంగా అక్టోబర్‌లో 9 మంది వివిధ విపత్తుల్లో మృతి

జిల్లా విపత్తు స్పందన, అగ్నిమాపక అధికారి సిహెచ్.రత్నబాబు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఈ ఏడాది జనవరి నుంచి నవంబర్ వరకు జిల్లాలో 492 ప్రమాదాలు చోటు చేసుకోగా రూ.3,14,15,596 ఆస్తినష్టం జరిగినట్లు, రూ.7,68,47,636 ఆస్తిని కాపాడినట్లు జిల్లా విపత్తు స్పందన, అగ్నిమాపక అధికారి సిహెచ్.రత్నబాబు తెలిపారు. ఈ సంవత్సరం సంభవించిన విపత్తు, అగ్నిమాపక ప్రమాదాలు, ఆస్తి, ప్రాణనష్టాలపై ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. అగ్ని ప్రమాదాల్లో భారీ ప్రమాదం ఒకటి, మధ్య తరహా ప్రమాదాలు 31, చిన్న తరహా ప్రమాదాలు 419 జరిగినట్లు, ఇతర ప్రమాదాలు 42 జరిగినట్లు ఆయన తెలిపారు. అగ్ని ప్రమాదాల్లో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని, ఇతర విపత్తుల్లో 27 మంది ప్రాణాలు కోల్పోయారని, నలుగురిని రక్షించామని తెలిపారు. అలాగే 11 పశువులను కాపాడినట్లు తెలిపారు. నెలవారి వివరాలు చూస్తే జనవరి నెలలో 34 ప్రమాదాలు జరగ్గా రూ.22.72 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు, రూ.46.83 లక్షల విలువైన ఆస్తిని కాపాడినట్లు తెలిపారు. ఫిబ్రవరిలో 36 ప్రమాదాలు చోటు చేసుకోగా రూ.38.51 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు, రూ.1,13,51,000 విలువైన ఆస్తిని కాపాడినట్లు తెలిపారు. మార్చిలో 62 ప్రమాదాలు జరగ్గా రూ.40.22 లక్షల ఆస్తి నష్టం వాటిల్లగా రూ.48.3 లక్షల ఆస్తిని కాపాడామని చెప్పారు. ఏప్రిల్‌లో 116 ప్రమాదాలు చోటు చేసుకోగా రూ.95.35 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని, రూ.2,45,88,000 విలువైన ఆస్తిని కాపాడామని తెలిపారు. మే నెలలో 56 ప్రమాదాలు జరగ్గా రూ.37.9 లక్షల ఆస్తి నష్టం వాటిల్లగా రూ.1,46,55,000 విలువైన ఆస్తిని కాపాడినట్లు తెలిపారు. జూన్‌లో 34 ప్రమాదాలు చోటు చేసుకోగా రూ.12.12 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని, రూ.54.69 లక్షల ఆస్తిని కాపాడామని, జులైలో 19 ప్రమాదాలు జరగ్గా రూ.22,500 లక్షల ఆస్తి నష్టం వాటిల్లగా, రూ.42,69,500 లక్షల ఆస్తిని కాపాడినట్లు తెలిపారు. ఆగస్టులో 56 ప్రమాదాలు చోటు చేసుకోగా రూ.37.9 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని, రూ.1,46,55,000 విలువైన ఆస్తిని కాపాడామని, సెప్టెంబర్‌లో 19 ప్రమాదాలు చోటు చేసుకోగా రూ.23.89 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని, రూ.58.90 లక్షల విలువైన ఆస్తిని కాపాడామని తెలిపారు. అక్టోబర్‌లో 22 ప్రమాదాలు చోటు చేసుకోగా రూ.40 లక్షల ఆస్తి నష్టం జరిగిందని, రూ.1,02,75,000 విలువైన ఆస్తిని కాపాడామని చెప్పారు. నవంబర్‌లో మొత్తం 38 ప్రమాదాలు చోటు చేసుకోగా రూ.41.16 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు, రూ.96.9 లక్షల విలువైన ఆస్తిని కాపాడినట్లు తెలిపారు. సంవత్సరం మొత్తం మీద అత్యధికంగా అక్టోబర్‌లో తొమ్మిది మంది వివిధ విపత్తుల్లో ప్రాణాలు కోల్పోయారని తెలిపారు.

ఆర్‌జియుకెటి విద్యార్థులు, అధ్యాపకుల సాయం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జియుకెటి నూజివీడు క్యాంపస్‌లో ఇఇఇ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఎం.అనూషను బ్రెయిన్ స్ట్రోక్ కారణంగా ఈ నెల 19వ తేదీన విజయవాడలోని ఒక ప్రయివేట్ ఆసుపత్రిలో చేర్పించారు. ఆమెకు అత్యవసరంగా శస్త్రచికిత్స చేయాల్సి ఉన్న కారణంగా ఖర్చుల కోసం అవసరమైన మొత్తాన్ని ఆర్‌జియుకెటి విద్యార్థులు, అధ్యాపకులు ఏర్పాటు చేశారు. అనంతరం విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్‌కు ఎక్స్ వేదిక ద్వారా తెలుపగా వెనువెంటనే లోకేష్ సానుకూలంగా స్పందించి ఎం.అనూషకు తమ టీమ్ బాధ్యత తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఆ తర్వాత లోకేష్ టీమ్ దగ్గర నుంచి అన్నివిధాలా సహాయ సహకారాలను అందిస్తూ ఎక్కువ మొత్తంలో సాయం అందించాలనే సదుద్దేశంతో సిఎం కార్యాలయానికి విషయాన్ని తెలియపరిచారు. ఇలా నారా లోకేష్ ఆఫీసు ద్వారా విషయం తెలుసుకున్న సిఎం చంద్రబాబు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఆమె వైద్య ఖర్చుల కోసం రూ.12 లక్షలు మంజూరు చేశారు. అనంతరం ఆమెకు సాధ్యమైనంత ఉత్తమమైన వైద్యం అందేలా చూడాలని ఆసుపత్రి అధికారులను ఆదేశించారు.

పలు సంఘాల క్యాలెండర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ రూపొందించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా డ్వామా పీడీ సుబ్బారావు ఆవిష్కరించారు. ఏలూరు డ్వామా జిల్లా కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ సుబ్బారావు మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులు, పేదలు, ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కారం కోసం సంఘం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. జిల్లాలో వ్యవసాయ కార్మికులు, ఉపాధి కూలీలు కష్టపడి పని చేసున్నారని, వారికి కనీసం వేతనం రావాలని వ్యవసాయ కార్మిక సంఘం పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం, జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.మహంకాళిరావు, జిల్లా కమిటీ సభ్యులు అందుగుల ప్రభాకర్, ఎస్.సాయికృష్ణ, ఆస్కార్ అప్పలస్వామి పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ :రైతు సంఘం జిల్లా కమిటీ రూపొందించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ బాషా ఆవిష్కరించారు. మంగళవారం ఏలూరు వ్యవసాయ శాఖ జిల్లా కార్యాలయంలో రైతు సంఘం 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్ హబీబ్ బాషా మాట్లాడుతూ రైతాంగ సమస్యల పరిష్కారం కోసం రైతు సంఘం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ 2025లో రైతులకు పెట్టుబడి సాయం అందించి అన్నదాతలకు ప్రభుత్వం అన్నివిధాలా తోడ్పాటు అందించాలని కోరారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, నాయకులు ఎం.శ్రీనివాసరావు, జక్కుల రామారావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

చింతలపూడి:విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ ఆకాంక్షించారు. ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయం వద్ద ఎస్‌టియు ఎపి నూతన సంవత్సరం 2025 క్యాలెండర్లు, డైరీలు చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్‌ఎ సొంగా రోషన్ కుమార్ ఆవిష్కరించారు. ఎస్‌టియు నిపుణులు తయారుచేసిన టెన్త్ క్లాస్ స్టడీ మెటీరియల్ పదో తరగతి విద్యార్థులకు అందించారు. ఎస్‌టియు సంఘం చేసిన ఈ మంచి పనికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు సామ్యూల్, ఆర్థిక కార్యదర్శి రాము, చింతలపూడి ఎంఇఒ కిరణ్‌బాబు, లింగపాలెం మండల బాధ్యులు సొంగా నాగేశ్వరరావు, చింతలపూడి, చాట్రాయి, ఆగిరిపల్లి, ముసునూరు మండల బాధ్యులు, తిరుపతిస్వామి ప్రభాకర్, వెంకట్, వెంకటేశ్వరరావు, బాబూరావు, హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు, బాబూరావు, నరసింహారావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇంటింటికీ సామాజిక పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి - కుక్కునూరు

మండల కేంద్రంలో పెన్షన్ కార్యక్రమం సందడిగా సాగింది. కుక్కునూరు మండల కేంద్రంలో జనవరి ఒకటో తేదీన ఇవ్వాల్సిన పెన్షన్ ఒక్కరోజు ముందుగా డిసెంబర్ 31నే ఇవ్వడంతో పెన్షన్‌దారులు ఆనందం వ్యక్తం చేశారు. అదేవిధంగా గత కొన్ని సంవత్సరాలుగా తల సేమియా వ్యాధితో బాధపడుతున్న గరటం వసుంధర అనే అమ్మాయికి కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో మొట్టమొదటి పెన్షన్ రూ.పది వేలను టిడిపి మండలాధ్యక్షులు ముళ్లిశెట్టి నాగు ఆధ్వర్యంలో కూటమి నాయకులు అందించారు. ఊటుకూరి నరసింహారావు గత నెల రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. వారు మరణించిన నెల రోజుల్లోనే వారి భార్యకు వితంతు పెన్షన్ కింద కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రూ.నాలుగే వేలను అందించారు. ఒగిరాల కృష్ణ అనారోగ్యంతో నెల రోజుల క్రితం మృతి చెందాడు. ఆయన భార్యకు నెల రోజుల్లోనే వితంతు పెన్షన్ కింద రూ.నాలుగు వేలను కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో అందించారు.

చింతలపూడి : అవ్వ, తాతలకు పింఛన్లను పంపిణీ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ఘనత ఒక్క టిడిపి కూటమి ప్రభుత్వానికే చెల్లిందని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. మండలంలోని వేలంపేట వద్ద ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి మద్దతుతో సంక్షేమం చేసి చూపించే ప్రజా ప్రభుత్వం ఏర్పాటైందన్నారు.

ఏలూరు సిటీ :గత వైసిపి పాలనలో పెన్షన్ పొందేంతవరకూ లబ్ధిదారుల్లో టెన్షన్ నెలకొనేదని, ఇప్పుడు ఠంచన్‌గా వారికి పెన్షన్ అందుతోందని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి స్పష్టం చేశారు. ఏలూరు 15, 16 డివిజన్ల పరిధిలో నూతనంగా మంజూరైన పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి, ఆర్‌టిసి విజయవాడ జోన్-2 ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడులు ముఖ్య అతిథులుగా హాజరై అర్హులైన లబ్ధిదారులకు నూతన పెన్షన్లను అందించారు.

టి.నరసాపురం : మండలంలో 7,686 మందికి సామాజిక పెన్షన్లు పంపిణీ విజయవంతంగా నిర్వహించినట్లు టిడిపి రాష్ట్ర కార్యదర్శులు జయ్యవరపు శ్రీరామ్మూర్తి, శీలం వెంకటేశ్వరరావు తెలిపారు. జనవరి నెల పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని కేతవరం, వీరభద్రంవరం గ్రామాల్లో పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పెన్షన్లు పంపిణీ చేశారు.

జీలుగుమిల్లి : మండలవ్యాప్తంగా 4,267 పెన్షన్లకు 4,046 పింఛన్లను సచివాలయ సిబ్బందితో మంగళవారం పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ కె.వెంకటలక్ష్మి తెలిపారు. ఒకటో తేదీన నూతన సంవత్సరం కావడంతో ఒక్కరోజు ముందుగానే పెన్షన్ పంపిణీ చేసినట్లు చెప్పారు. మండలవ్యాప్తంగా 94.82 శాతం వరకు పెన్షన్ల ప్రక్రియ పూర్తయినట్లు ఆమె తెలిపారు.

ముసునూరు : ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్లు ఒక్కరోజు ముందుగానే అందించిన ఘనత సిఎం చంద్రబాబుకే దక్కుతుందని టిడిపి వేల్పుచర్ల గ్రామ నాయకులు నాని అన్నారు. మంగళవారం పింఛన్లు అందించినట్లు చెప్పారు. రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి సతీమణి లక్ష్మీకమల వృద్ధులకు, వికలాంగులకు దుప్పట్లు అందించారు.

పంకజ్‌కుమార్‌ను కలిసిన యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నూతనంగా విధుల్లో చేరిన సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ పంకజ్‌కుమార్‌ను ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఏలూరు జిల్లా కమిటీ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తఫా అలీ, రవికుమార్ రుద్రాక్షి మాట్లాడుతూ పరిపాలన విషయంలో అన్ని రకాలుగా తమ సంఘం సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి రంగమోహన్, కార్యదర్శి సుధారాణి, ఈడే శివశంకర, జిక్రియా పాల్గొన్నారు.

సోలార్ ప్యానల్‌ను వినియోగించుకోండి

ప్రజాశక్తి - మండవల్లి

సోలార్ ప్యానల్‌ను వినియోగించుకుని విద్యుత్ అధిక బిల్లుల భారాన్ని తగ్గించుకోవచ్చని ఇండియన్ బ్యాంక్ మండవల్లి శాఖ మేనేజర్ కె.జ్యోతిప్రసాద్ తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు ఇంటిపై ఏర్పాటుచేసిన సూర్య ఘర్ సోలార్ ప్లాంట్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సూర్య ఘర్ సోలార్ ప్లాంట్‌పై అవగాహన పెంచుకొని ఏర్పాటు చేసుకుని లబ్ధి పొందాలని ఆయన కోరారు.

రోడ్లపై గుంతలను పూడ్చాలి

ప్రజాశక్తి - చింతలపూడి

సంక్రాంతి పండుగ నాటికి గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని అధికారులను చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ ఆదేశించారు. చింతలపూడి నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బి రహదారుల అభివృద్ధి , గుంతలు పూడ్చే కార్యక్రమాల పనుల పురోగతిపై ఆయన సోమవారం ఏలూరు ఆర్‌అండ్‌బి సర్కిల్ కార్యాలయంలో సమీక్షించారు. ఆర్‌అండ్‌బి సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.జాన్‌మోషేతో కలిసి ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సంక్రాంతి పండుగ నాటికి గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఎంఎల్‌ఎ అధికారులను ఆదేశించారు.

యుటిఎఫ్ మహాసభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

యుటిఎఫ్ మహాసభ విజయవంతం కోరుతూ ఉపాధ్యాయులను ఆహ్వానించేందుకు స్వర్ణోత్సవ ప్రచార యాత్ర ఏలూరులో బయలుదేరి జీలుగుమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చేరుకుంది. యుటిఎఫ్ బృందంతో కాసేపు ముచ్చటించారు. అనంతరం మహాసభలకు ఉపాధ్యాయులను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అల్లాడి రాజు, చెన్నారావు, పోసమ్మ, సోమేశ్వరరావు, రామ తులసి, సత్యవతి, చంద్రావతి పాల్గొన్నారు.

ముసునూరు :యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రచార జాతా నిర్వహించినట్లు ప్రధాన కార్యదర్శి గుడిమెళ్ల రాంబాబు తెలిపారు. రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని రమణక్కపేట సెంటర్‌లో మంగళవారం ప్రచార జాతా నిర్వహించారు. ఉపాధ్యాయులను ఉద్దేశించి ప్రసంగించారు. జనవరి 5, 6, 7, 8వ తేదీల్లో కాకినాడలో విద్య వైజ్ఞానిక మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి వేలాది ఉపాధ్యాయులు హాజరు కావాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ ముస్తాఫా అలీ, ప్రధాన కార్యదర్శి రుద్రాక్ష రవికుమార్, రాష్ట్ర కార్యదర్శి బొర్రా సుజాత, గౌరవ అధ్యక్షులు శ్యాంబాబు, సహాధ్యక్షులు జి.వెంకటేశ్వరరావు, కోశాధికారి రంగమోహన్, ఆడిట్ కమిటీ సభ్యులు కాసాని గంగయ్య, మండలాధ్యక్షుడు జి.పద్మకిషోర్, ప్రధాన కార్యదర్శి గుడిమెళ్ల రాంబాబు, సహాధ్యక్షులు ఎ.పుల్లయ్య, కోశాధికారి నక్క నారాయణ పాల్గొన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలను అడ్డుకోవాలి

ద్వారకాతిరుమల :మండలంలోని పంగిడిగూడెం వద్ద ఉన్న పోలవరం కుడి కాలువగట్టుపై ఉన్న మట్టి మొత్తాన్ని ఇప్పటికే 90 శాతం తవ్వేశారని, మిగిలిన పది శాతాన్ని కూడా మిగల్చకుండా తవ్వేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని సిపిఎం నేతలు విమర్శించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.లింగరాజు, ద్వారకాతిరుమల, భీమడోలు మండలాల పార్టీ ఆర్గనైజర్ కట్ట భాస్కరరావు బృందం పోలవరం కుడి కాలువ గట్టును మంగళవారం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలవరం కుడి కాలువకు రెండువైపులా ఉన్న మట్టిని రూ.కోట్లుగా మలుచుకున్నారని, ఇది అత్యంత దుర్మార్గమని అన్నారు.

IN THE COURT OF THE 2nd ADDITIONAL CIVIL JUDGE (JUNIOR DIVISION) AT TANUKU
O.S.No.255/2023

Between:
1.M/s.Laham Foods Products Pvt., Ltd., Represented by its Managing Director, Nabeel Ahmad.
2.M/s.Laham Foods Products Pvt., Ltd., Represented by its General Manager, Arvind Kumar Sareen. ...Plaintiffs
And
1.Karuturi Chandrasekhar
2.Kondareddy Srinivas ...Defendants

Summons to the 2nd Defendant Kondareddy Srinivas, S/o.Danaiah, Racherla, Pentapadu Mandal, West Godavari District.

SUMMONS TO 2nd DEFENDANT BY WAY OF PAPER PUBLICATION

Where as the above named plaintiffs filed a suit against you for a permanent injunction and you being the 2nd defendant has been avoiding to take summons from the Hon'ble court in the above matter and so the Hon'ble court was pleased to order summons and notice to you by way paper publication. So, you are here by required to appear before the Hon'ble court on **10.01.2025 at 10.30** either in person or through your advocate and to raise your defense, if any. Otherwise, the matter will be heard and decided by setting you as exparte.

By order of Court,
Vedula Rama Sasidhar, Advocate,
Flat No.101, Vasavi Enclave,
D.No.19-11-22, Kondurivari Street, Tanuku.
Cell: 9030115165, 9397916399.

IN THE COURT OF THE 2nd ADDITIONAL CIVIL JUDGE (JUNIOR DIVISION) AT TANUKU
I.A.No.1/2023 in O.S.No.255/2023

Between:
1.M/s.Laham Foods Products Pvt., Ltd., Represented by its Managing Director, Nabeel Ahmad.
2.M/s.Laham Foods Products Pvt., Ltd., Represented by its General Manager, Arvind Kumar Sareen. ...Petitioners
And
1.Karuturi Chandrasekhar
2.Kondareddy Srinivas ...Respondents

Notice to 2nd Respondant Kondareddy Srinivas, S/o.Danaiah, Racherla, Pentapadu Mandal, West Godavari District.

NOTICE TO 2nd RESPONDENT BY WAY OF PAPER PUBLICATION

Where as the above named plaintiffs filed a suit against you for a permanent injunction and also filed petition for grant of temporary injunction in I.A.No.1/2023 and you being the 2nd respondant has been avoiding to take summons from the Hon'ble court in the above matter and so the Hon'ble court was pleased to order summons and notice to you by way paper publication. So, you are here by required to appear before the Hon'ble court on **10.01.2025 at 10.30** either in person or through your advocate and to raise your defense, if any. Otherwise, the matter will be heard and decided by setting you as exparte.

By order of Court,
Vedula Rama Sasidhar, Advocate,
Flat No.101, Vasavi Enclave,
D.No.19-11-22, Kondurivari Street, Tanuku.
Cell: 9030115165, 9397916399.